సాక్షి పెద్దపల్లి

బుధవారం, 3, మే, 2023



కరాటే శిక్షణ.. ఆత్మ రక్షణ

విశ్వభారతి విద్యా సంస్థల సౌజన్యంతో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కరాటే శిక్షణ శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా మెలకువలు నేర్చుకుంటున్నారు. 8లో▸



వార్షిక లక్ష్యాలపై సింగరేణి గురి

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సింగరేణి దృష్టిసారించింది. వార్షిక సంవత్సరం మొదటి నెలలోనే ఆరు ఏరియాలు లక్ష్యాన్ని సాధించాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడి అధికంగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

మడిపెల్లిలో కుంకుమ పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మడిపెల్లిలో మహాలింగేశ్వర స్వామి, శ్రీలక్ష్మి, మహాలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ఘనంగా సాగాయి. అర్చక పురోహితులు సువర్ణ రాజేంద్ర శర్మ, సువర్ణ శ్రీధర్‌శర్మ వేదమంత్రాల మధ్య హోమం, పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచు అడిగొప్పుల రాణి, మాజీ ఎంపీటీసీ రానవేన రాజమల్లు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మోహన్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మంథని మున్సిపాలిటీకి రూ.36 లక్షలు మంజూరు

మంథని: మంథని మున్సిపాలిటీకి రూ.36 లక్షలు నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మంజూరైనట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. వీటితో బల్దియా పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. బోయిన్‌పేటలో యాదవ సంఘం కమ్యూనిటీ హాల్‌కు రూ.10లక్షలు, లక్ష్మీదేవర కమ్యూనిటీ హాల్‌కు రూ.5లక్షలు, మసీదువాడలో రూ.2.50 లక్షలతో హైమాస్ట్ లైట్లు, ముత్యాలమ్మవాడలో కోర్టు వద్ద ఓపెన్ జిమ్‌కు రూ.4లక్షలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మెటల్ రోడ్డు, నడివీధి, చైతన్యపురి కాలనీలో సిమెంట్ రోడ్లకు రూ.15 లక్షలు, ఆరెంద శివాలయం సమీపంలో బోర్‌వెల్‌కు రూ.1.25లక్షలు, ఖాన్‌సాయిపేట ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.2లక్షలు మంజూరైనట్లు ప్రకటనలో పేర్కొంది.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సమస్య పరిష్కరించండి




మంత్రి కొప్పులకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: ఎల్లంపల్లి భూ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని, ముంపు గ్రామాల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కోరారు. మంగళవారం సచివాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఎల్లంపల్లి, మద్దిర్యాల, పొట్యాల, వేంనూర్, ముర్మూర్ గ్రామాల్లోని పెండింగ్ సమస్యలతోపాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపచేయాలన్నారు.

జాతీయ సాంకేతిక వేడుకకు హర్షితకు ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: ఈనెల 11 నుంచి 14 వరకు ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ సాంకేతిక వేడుకల్లో పాల్గొనేందుకు ఇన్‌స్పైర్ విజేత హర్షితకు ఆహ్వానం అందినట్లు డీఈఓ మాధవి తెలిపారు. జిల్లాలోని రామగిరి మండలం చందనాపూర్ పాఠశాలలో చదువుతున్న హర్షిత 9వ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల పోటీలో సత్తా చూపి జిల్లా కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన విషయం తెలిసిందే. నేషనల్ టెక్నాలజీ డే వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్న హర్షితను డీఈఓ, జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు అభినందించారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ, చిత్రంలో విద్యుత్ అధికారులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని అన్ని విద్యుత్ కార్యాలయాలు, సబ్‌స్టేషన్ల వద్ద విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ సుదర్శన్ తెలిపారు. విద్యుత్ వినియోగ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను మంగళవారం రాఘువాపూర్ సబ్‌స్టేషన్ వద్ద ఆవిష్కరించారు. ఏడీఈ, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న పిడుగులు

గతనెల 22.. పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామపంచాయతీ పరిధి గొల్లపల్లి గ్రామంలో ఆవుల మహేందర్, కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన జంగం కొమురయ్య (47) పిడుగుపాటుతో మృతిచెందారు. అదే నెల 28న ధర్మారం మండలం పత్తిపాక గ్రామానికి చెందిన ఆకుల సత్తయ్య గేదెపై పిడుగు పడి మృతి చెందింది. వారం వ్యవధిలోనే జిల్లాలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి.



- జిల్లాలో తరచుగా చోటుచేసుకుంటున్న ఘటనలు
- అవగాహన లేక దరఖాస్తు చేసుకోని బాధితులు
- 2022 నుంచి నలుగురు చనిపోయినట్లు దరఖాస్తులు
- పరిహారం కోసం తప్పని ఎదురుచూపులు

సాక్షి, పెద్దపల్లి: ఉరుములు, మెరుపులతో వర్షం పడితే ఏదోచోట పిడుగుపడి ప్రజలు మృత్యువాత పడుతున్నా ఘటనలు జిల్లాలో చోటుచేసుకుంటున్నాయి. పిడుగులధాటికి మూగజీవాలూ బలవుతున్నాయి. అకస్మాత్తుగా జరిగే ఈ ప్రమాదాలతో అనేక కుటుంబాలు వీధినపడి ఆర్థికంగా చితికిపోతున్నాయి. అయితే ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నష్టం వాటిల్లితే పరిహారం పొందవచ్చనే విషయం తెలియక బాధిత కుటుంబాలు దరఖాస్తు చేసుకోవటం లేదు. అధికారులు కూడా పట్టించుకోకపోవటం, స్థానిక నేతలకు అవగాహన లేకపోవడం కూడా కారణంగా తెలుస్తోంది. జిల్లాలో 2022 నుంచి పిడుగుపాటుతో నలుగురు మృతిచెందినట్లు పరిహారం కోసం దరఖాస్తులు వచ్చాయని, వాటికి సంబంధించిన నివేదికలు ప్రభుత్వానికి పంపించామని అధికారులు అధికారులు చెబుతున్నారు.

వేసవిలో పిడుగులు అధికం..

ఉరుములు, మెరుపులు, పిడుగుల ప్రభావం వేసవిలోనే ఎక్కువగా ఉంటుంది. ఏప్రిల్ నుంచి జూన్‌లో నైరుతి రుతుపవనాలు ప్రవేశించేవరకూ పగటి ఉష్ణోగ్రతలు 40నుంచి 48డిగ్రీల వరకు నమోదవుతుంటాయి. దీనివలన భూతాపం పెరుగుతుంది. ఈ సమయంలో సముద్రం నుంచి వచ్చే గాలుల్లో తేమశాతం పెరిగితే.. ఆకాశంలో నల్లని దట్టమైన క్యూములోనింబస్ అలుముకుంటాయి. అప్పుడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతుంది. ఇలాంటి సమయంలోనే పిడుగులు పడుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు.

పరిహారమూ పొందొచ్చు..

పిడుగుపాటుకు గురై మృత్యువాత పడిన వారి కుటుంబాలకు ప్రకృత్తి విపత్తు కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం అందిస్తాయి. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ కింద బాధిత కుటుంబాలకు రూ.6లక్షలు అందించే అవకాశముంది. పిడుగుల ధాటికి కన్ను, కాలు వంటివి కోల్పోతే (తీవ్రత 40 నుంచి 60శాతం లోపు అయితే) రూ.59,100, తీవ్రత 60శాతం దాటితే రూ.2లక్షల వరకు ఇస్తారు. ఇందుకు వైద్యులు ధ్రువీకరించాల్సి ఉంటుంది. మృతుల కుటుంబాలకు పరిహారం అందాలంటే పిడుగుపాటుతోనే మృత్యువాత పడినట్లు ఎఫ్ఐఆర్ నమోదు కావాలి. పంచనామా, పోస్టుమార్టం ఆధారంగా తహసీల్దార్ నివేదిక ఇస్తారు.

యాప్ ద్వారా పిడుగుల సమాచారం

పిడుగుల సమాచారాన్ని వజ్రపాత్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. దీన్ని స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతిఒక్కరూ గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ యాప్‌లో ఉండే వలయాలను అనుసరించి ఏ ప్రాంతంలో పిడుగుపడుతుంది..? మనం ఎంతవరకు రక్షణ పొందవచ్చు..? అని తెలుసుకునే అవకాశముంది.

అప్రమత్తతే రక్ష

- ➜ భారీ గాలి వీస్తున్నా ఉరుములు, పిడుగులు పడే ప్రమాదం ఉందని గుర్తించాలి. ఆ సమయంలో దగ్గరలోని పెద్ద భవనాల్లోకి వెళ్లడం ఉత్తమం
- ➜ ఉరుములు, మెరుపులు, గాలివాన సమయంలో ద్విచక్రవాహనాలపై వెళ్లరాదు. లోహపు వస్తువులను తాకరాదు.
- ➜ బహిరంగ ప్రదేశాల్లో మొబైల్ ఫోన్స్ వాడరాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెట్ల కింద ఉండకూడదు.
- ➜ ఉరుముల సమయంలో ఇళ్లలో ఉన్నవారు తలుపులు, కిటికీలు మూసివేయాలి. ఇంట్లో విద్యుత్‌తో నడిచే అన్ని వస్తువులకూ విద్యుత్ సరఫరా నిలిపివేయాలి.
- ➜ ఖాళీగా ఉన్న విశాలమైదానంలో ఉంటే చెవులు మూసుకుని, మోకాళ్లలో తల పెట్టుకుని నేలపై కూర్చోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



ఉరుములతో కూడిన వర్షం కురిసే సమయంలో వీలైనంత వరకు ఇళ్లలో ఉండడం ఉత్తమం. ముఖ్యంగా చెట్టు నీడలో ఉండవద్దు. చెట్లు పిడుగులను ఆకర్షించే అవకాశం ఎక్కువ. పిడుగుపాటుకు గురైన వ్యక్తులకు వెంటనే ఆస్పత్రికి తరలించాలి. చలి పిడుగు, అగ్గిపిడుగు రెండు రకాలు ఉంటాయి. వాటిని బట్టి వైద్యసేవలు అందిస్తాం. – ప్రమోద్‌కుమార్, డీఎంహెచ్‌వో

రంగుమారిన ధాన్యాన్ని కొనండి

- కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో
- అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలు
- ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం
- పోలీసుల జోక్యం.. శాంతించిన వైనం



ఖిలవనపర్తిలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, అడ్డుకుంటున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు

ధర్మారం: అకాలవర్షాలకు తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఖిలావనపర్తి కొనుగోలు కేంద్రం వద్ద.. పెద్దపల్లి-ధర్మారం రోడ్డుపై నాయకులు రాస్తారోకోకు దిగారు. కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ హాజరయ్యారు. సమాచారం అందుకున్న బీఆర్ఎస్ నాయకులు మద్దునాల వెంకటేశం ఆధ్వర్యంలో అక్కడకు చేరుకుని ధాన్యం కొంటుంటే రైతులను ఎందుకు ఆగం చేస్తున్నారని వారితో వాగ్వావాదానికి దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులు చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. అనంతరం లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ అకాలవర్షాలతో రైతులు నష్టపోతే ప్రభుత్వ పట్టించుకోవటం లేదన్నారు. తడిసిన ధాన్యానికి పదికిలోల తరుగుతీయటం ఎంతవరకు న్యాయమన్నారు. కాంగ్రెస్ నాయకులు మోటపలుకుల అశోక్, ఎదుల్ల అంజయ్య, కాంపెల్లి రాజేశం, కరెటి వేణు, పోల్‌దాసరి సంతోష్, మోతె రవి, వడ్లకొండ అంజయ్య, గుర్రం రాజేశం, తమ్మడవేని రవి, బీఆర్ఎస్ నాయకులు కాంపెల్లి రాజయ్య, కీసర స్వామి, కాశిపేట శ్రీనివాస్, తడకొండ రమేష్, నంచర్ల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



వెన్ను విరిచిన వాన

- 5,690 ఎకరాల్లో పంటనష్టం
- కేంద్రాల్లో మొలకెత్తుతున్న ధాన్యం
- ఆదుకోవాలంటూ అన్నదాతల ఆందోళనలు

సాక్షి, పెద్దపల్లి: అకాల వర్షాలు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వానలతో ఆరుగాలం కష్టం కనుమరుగవుతోంది. ప్రకృతి చేస్తున్న విలయతాండవానికి రైతు విలవిలలాడుతున్నాడు. సాగుకు చేసిన అప్పు ఎలా తీర్చాలని గుండెలు బాదుకుంటున్నాడు. ఆదివారం కురిసిన కుండపోత వర్షంతో జిల్లా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాలవర్షంతో పొలంలోని వరిపంట, ఐకేపీ, పీఏసీఎస్, మార్కెట్ కమిటీలకు వచ్చిన ధాన్యం తడిసి మొలకెత్తుతున్నాయి. కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేని కారణంగా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆరబెడదామంటే వాన ఎప్పుడు కురుస్తుందో తెలియని పరిస్థితి ఉండగా.. తేమశాతం రావడం లేదంటూ కాంటాలు పెట్టడం లేదు.

కుండపోత వర్షంతో 5,690 ఎకరాల్లో నష్టం

ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో జిల్లావ్యాప్తంగా 5,690 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందులో ప్రధానంగా 5,290 ఎకరాల్లో వరి, 100 ఎకరాల్లో మొక్కజొన్న, 300 ఎకరాల్లో మామిడి తీవ్రంగా దెబ్బతిన్నాయని అధికారులు అంచనా వేశారు. పంట నష్టంపై నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించామని అధికారులు చెబుతున్నారు.



మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న మహిళ

ధర్నాలు, నిరసనలు

జిల్లాలో అకాలవర్షాలతో నష్టపోయిన అన్నదాతలను ఆదుకోవాలని, కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు రైతులకు మద్దతుగా జిల్లావ్యాప్తంగా రాస్తారోకోలు నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్ సింగ్, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, బీజేపీ జిల్లా అధ్యక్షులు రావుల రాజేందర్, బీఎస్పీ నేత దాసరి ఉష తదితరులు పంట పొలాలు, మార్కెట్‌లను సందర్శించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని, కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

రైతులను ఆదుకోండి



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

పాలకుర్తి: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ డిమాండ్ చేశారు. బసంత్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి మొలక వస్తోందని, పొలాలు కోయలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి షరతులు లేకుండా తడిసిన ధాన్యం కొనాలన్నారు. రైతులకు ఎకరాకు రూ.30వేలు అందించాలని కోరారు. మండలంలో మట్టిమాఫియా, అంతర్గాంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని, వాటిపై అధికారులు ఉక్కుపాదం మోపాలని కోరారు. కన్నాల టోల్‌ప్లాజాలో స్థానికులకు ఉపాధి చూపాలని, లేకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, నాయకులు ముక్కెర శ్రీనివాస్, తలారీ శంకర్, వేల్పుల రాజ్‌కుమార్, తోట ప్రశాంత్, నార సత్తయ్య, వాసుదేవరావు, కృష్ణ ఉన్నారు.

కమాన్‌పూర్‌లో రాస్తారోకో..

కమాన్‌పూర్: అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనాలని రామగిరి మండలం కల్వచర్ల వద్ద మంథని – పెద్దపల్లి ప్రధాన రహదారిపై కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట చంద్రయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, ఎంపీటీసీ కొట్టె సందీప్, కాటం సత్యం, ముత్యాల శ్రీనివాస్, కన్నూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా కొనాల్సిందే..



సుగ్లాంపల్లి వద్ద రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

- కౌలు రైతులకు న్యాయం చేయండి
- తడిసిన ధాన్యం కొనేవరకూ ఆందోళన
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్

సుల్తానాబాద్: తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ డిమాండ్ చేశారు. సుల్తానాబాద్‌లోని సుగ్లాంపల్లి స్టేజీవద్ద రాజీవ్ రహదారిపై అన్నదాతలతో కలిసి రాస్తారోకో చేశారు. అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేక ధాన్యం తడిసిపోతోందని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనేవరకూ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పరిహారంగా రూ.10వేలు రైతుల ఖాతాలో వేయాలని, కౌలురైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన సమాచారం అందుకున్న పోలీసులు నాయకులతో మాట్లాడారు. వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, తంగేడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్‌రావు, బెజ్జంకి దిలీప్, ఎర్రోళ్ల శ్రీకాంత్, ఉప్పు కిరణ్, సిల్వేరి మధు, ఉషణ అన్వేష్, సదయ్య, నాగరాజు రైతులు గట్టయ్య, కొమురయ్య, లక్ష్మయ్య, శ్రీనివాస్, కొమురమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్ష రద్దు

- తెలుగుకు బదులు ఇంగ్లిష్‌లో పేపర్
- పరీక్ష రాయలేమంటూ విద్యార్థుల నిరసన
- పేపర్ లాంగ్వేజ్ మారడమే కారణం..
- ఈనెల 13న తిరిగి నిర్వహణకు విద్యాశాఖ ఏర్పాట్లు



ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీవద్ద విద్యార్థుల నిరసన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ పరీక్షకు మంగళవారం హాజరైన విద్యార్థులు తెలుగు భాషకు బదులు ఇంగ్లిష్ మీడియం ఎకనామిక్స్ పేపర్ అందించారు. తాము ఇంగ్లిష్‌లో రాయలేమని, తెలుగులోనే కావాలని విద్యార్థులు నిరసనకు దిగారు. పోలీసులు వచ్చి సముదాయించి విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఎకనామిక్స్ పేపర్ రాష్ట్రమంతా ఆంగ్లంపేపర్ పంపించారని డీఈఓ మాధవి తెలిపారు. పరీక్షను రద్దు చేసి ఈనెల 13న తిరిగి నిర్వహిస్తామని, ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 ఏపీఏ ఏరియాలోని వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 25 రోజుల పాటు సెంటనరీకాలనీ రాణి రుద్రమాదేవి క్రీడా మైదానంలో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎం తన్నీరు వెంకటేశ్వర్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలు, మాజీ ఉద్యోగుల పిల్లలు, ప్రభావిత పరిసర గ్రామాల పిల్లల కోసం ఫుట్‌బాల్, వాలీబాల్, ఆర్చరీ(విలు విద్య), హాకీ, తదితర క్రీడలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 18 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని, ఆసక్తి గలవారు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగాంలో దరఖాస్తు చేసుకోవాలని, 93461 47111 నంబర్‌కు కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతులకు అన్యాయం చేయొద్దు



బొంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న విజయ్

పెద్దపల్లిరూరల్: వరి సాగు చేసిన రైతులు ఇప్పటికే ఎంతో నష్టపోయారని, వారి ధాన్యంలో కోత విధించొద్దని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. రైతుసంఘం నాయకులు, పార్టీశ్రేణులతో కలిసి అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణను మంగళవారం కలిసి రైతుల సమస్యలపై చర్చించారు. నిబంధనల మేరకు 40.750 కిలోలు తూకం వేయాల్సి ఉండగా 43 కిలోల వరకు తూకం వేసి రైతులకు అన్యాయం చేస్తున్నారని, అలా జరగకుండా చూడాలని కోరారు. ముందుగా పెద్దపల్లి మండలం బొంపల్లి, మేరపల్లి గ్రామాల్లో తడిసిన ధాన్యం కుప్పలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే ప్రతిగింజ కొనాలన్నారు. నాయకులు సురేశ్‌గౌడ్, నెత్తెట్ల కొమురయ్య, గుర్రాల రవి, తిరుపతిరావు, సంతోష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

క్లుప్తంగా

దాడి కేసులో ఇద్దరికి ఏడాది జైలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలో 2016లో జరిగిన దాడి కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మంగళవారం జూనియర్ సివిల్ జడ్జి రాణి తీర్పు చెప్పారు. ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం.. 2016లో పెద్దకల్వలకు చెందిన చెలకల మల్లేశంపై అదే గ్రామానికి చెందిన చెలకల వీరయ్య, చెలకల దుర్గయ్య దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేశారు. బాధితుడి తరఫున ఏపీపీ రాకేశ్ వాదించి సాక్ష్యాధారాలు సమర్పించడంతో వీరయ్య, దుర్గయ్యకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు నిచ్చారు.

చిన్నారులకు పురస్కారం అందజేత



చిన్నారులకు అవార్డు అందజేస్తున్న ప్రకాష్

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఏగోలపు జ్యోషిక, ఏగోలపు కౌశిక్‌లకు ఆదర్శ స్వర్ణ నందిజాతీయ అవార్డును ఆదర్శ కళానిలయం జాతీయ అధ్యక్షుడు చర్ల ప్రకాష్ అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లో త్యాగరాయ గానసభ నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. చిన్నారులు పొదుపు చేసుకున్న డబ్బులతో కరోనా కాలంలో రోడ్డు వెంట వెళ్లే వారికి అన్నదానం చేసినందుకు అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో దైవాజ్ఞ శర్మ, సినీ నటులు జ్యోతిరెడ్డి, రాజేందర్, కుమనన్, ఏలేశ్వరం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాలీ వాహనంలో మంటలు

మంథని: ముత్తారం మండలం కేశనపల్లి బస్టాండ్ సమీపంలో ట్రాలీ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. టెంట్ హౌస్‌కు సంబంధించిన సామగ్రిని తీసుకెళ్తుండగా ఇంజన్‌లో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వచ్చాయి. అప్రమత్తమైన ట్రాలీ డ్రైవర్ దూకడంతో ప్రమాదం తప్పింది.

ఆయన నేత్రాలు సజీవం



రాంనారాయణ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్ కాలనీ టీ1–362 క్వార్టర్‌లో నివాసం ఉంటున్న సింగరేణి మాజీ కార్మికుడు నూతి రాం నారాయణ(73) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేయుటకు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. పుట్టెడు దు:ఖంలో కూడా సమాజాహితం కోసం ఇద్దరు అంధులకు వెలుగులు ప్రసాదించాలనే సదుద్దేశంతో రాంనారాయణ నేత్రాలను దానం చేయుటకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు భార్య సుశీల, కొడుకులు, కోడళ్లు చంద్రమౌళి, షర్మిల, కనకరాజు, సౌజన్య, సురేష్ కుమార్, ఉష, కూతుర్లు, అల్లుళ్లు నాగలక్ష్మి, మహేశ్వర్, సుధారాణి, కిరణ్ కుమార్‌లను ఫౌండేషన్ బాధ్యులు తదితరులు అభినందించారు.

కరాటే శిక్షణ.. ఆత్మ రక్షణ

- విశ్వభారతి విద్యా సంస్థల సౌజన్యంతో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ
- ఉత్సాహంగా శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులు



కరాటే సాధనలో విద్యార్థులు

జ్యోతినగర్(రామగుండం): ప్రస్తుతం రోజూ దేశంలోని ఏదో ఒక ప్రాంతంలో ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుల కోసం బయటికి పంపించాలంటేనే ఆందోళన చెందుతున్నారు. బాలికలకు చదువు ఒక్కటే సరిపోదని, ఆపద సమయంలో తమను తాము రక్షించుకునేందుకు కరాటే లాంటి సెల్ఫ్ డిఫెన్స్ ఎంతో అవసరమని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి విద్యాసంస్థల సహకారంతో 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కరాటే ఉచిత శిక్షణ శిబిరంలో విద్యార్థులు చేరుతున్నారు.

శిక్షకుల పర్యవేక్షణలో..

ఉదయం సమయంలో ఉపాధ్యాయులు, కరాటే శిక్షకుల పర్యవేక్షణలో విద్యార్థులకు శిక్షణ కొనసాగుతుంది. ఈ శిక్షణతో తమ పిల్లలు ఎలాంటి ఘటనైనా ఎదుర్కొంటారనే నమ్మకం తమలో కలిగిందని పలువురు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. శిక్షణ ఇచ్చేందుకు నిపుణులైన కరాటే మాస్టర్లను ఎంపిక చేసినట్లు విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్ తెలిపారు. విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి స్కూల్‌కు కాలినడక వచ్చి వెళ్తుంటారని, ఆ సమయంలో ఎలాంటి ఘటనలు జరిగినా వాటిని అధిగమించి తమను తాము కాపాడుకునేందుకు కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు సెల్ఫ్ డిఫెన్స్ కోసం ఉచితంగా కరాటే శిక్షణ ఇప్పిస్తున్నట్లు వివరించారు.

మనోధైర్యం పెరుగుతుంది



కరాటే నేర్చుకుంటున్న బాలికల్లో మనోధైర్యం పెరుగుతుంది. ఎలాంటి ఘటనలు ఎదురైనా ఎదుర్కొంటామనే ధీమా వారికి వస్తుంది. విద్యార్థినులకు ఆత్మరక్షణకు సంబంధించి మెలకువలు నేర్పిస్తున్నాం. కరాటే శిక్షణకు విద్యార్థులు అధిక సంఖ్యలో వస్తున్నారు. – మొండయ్య, డిప్యూటీ గ్రాండ్ మాస్టర్, ఆల్ ఇండియా ఒకినోవా మార్షల్‌ఆర్ట్

మెలకువలు నేర్పిస్తున్నారు



మా పాఠశాలలో కరాటేను నేర్పిస్తున్నారు. రోజూ ఉదయం సమయంలో కరాటే మాస్టర్ పలు మెలకువలు చెబుతున్నారు. తమను తాము ఎలా రక్షించుకోవాలో సూచిస్తున్నారు. దీంతో ఎదుటివారిని ఎదుర్కొంటామనే నమ్మకం కలుగుతుంది.

– వర్షిణి, 9వ తరగతి

కరాటే నేర్చుకుంటున్న



ప్రతి రోజు మార్నింగ్ సమయంలో కరాటే నేర్చుకుంటున్నా. నాకు ఇప్పుడు చాలా ధైర్యంగా ఉంది. స్కూల్‌లో కూడా ప్రతి వారంలో రెండు రోజులు ప్రత్యేకంగా కరాటే పీరియడ్స్ పెట్టాలి. నాతోటి స్నేహితులకు కూడా కరాటే నేర్చుకోమని చెబుతున్నా. – హేమంత్, ఏడవ తరగతి

'సాక్షి' మీడియాకు థాంక్స్



'సాక్షి' మీడియాకు థాంక్స్. పేపర్‌లో ఉచిత కరాటే శిక్షణ అని తెలిసిన వెంటనే వచ్చా. నాకు కరాటే మాస్టర్స్ మంచి శిక్షణ ఇస్తున్నారు. నేను మంచి బెల్ట్ సాధించేందుకు కష్టపడతా. – నిశిత్త, ఆరో తరగతి, సెయింట్ క్లేర్ హైస్కూల్



ఓసీపీలో బొగ్గు వెలికితీస్తున్న షావల్‌యంత్రం

వార్షిక లక్ష్యాలపై సింగరేణి గురి

- మొదటి నెలలో 99 శాతం బొగ్గు ఉత్పత్తి
- లక్ష్యాలు సాధించిన ఆరు ఏరియాలు
- చివరి స్థానంలో నిలిచిన అడ్రియాల ప్రాజెక్టు

గోదావరిఖని(రామగుండం): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనపై సింగరేణి దృష్టిసారించింది. వార్షిక సంవత్సరం మొదటి నెలలోనే ఆరు ఏరియాలు లక్ష్యాన్ని సాధించాయి. 2023–24 ఆర్థిక సంవత్సరం మొదటి నెలలో సింగరేణిలో 56.07 లక్ష్యానికి 55.73 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యాల సాధనలో 99 శాతం చేరుకున్నాయి. 11 ఏరియాల్లో ఆరు ఏరియాలు లక్ష్యాలను చేరుకోగా మరో ఏరియా లక్ష్యానికి దగ్గరలో నిలిచింది. కేవలం నాలుగు ఏరియాలు మాత్రమే నిర్దేశిత లక్ష్యాల సాధనలో వెనకబడ్డాయి. వేసవికాలం కావడం ఈనెలలో ఓసీపీలో బొగ్గు ఉత్పత్తికి కలిసి వచ్చే అంశం. అయితే ఇటీవల కురిసిన అకాల వర్షాల మూలంగా ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి కొద్దిమేర ఆటంకం ఏర్పడింది. జూన్‌లో వర్షాలు ప్రారంభం కానుండటంతో మే నెలలోనే ఓసీపీల్లో సాధ్యమైనంత ఎక్కువ బొగ్గు ఉత్పత్తి తీయాలనే లక్ష్యంతో డైరెక్టర్లు ఏరియాల వారీగా పర్యటనలు నిర్వహిస్తున్నారు. అధికారులతో సమావేశమై ఉత్పత్తి లక్ష్యాల సాధనపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఓసీపీల ఉత్పత్తితో పరోక్ష సంబంధం ఉన్న ఓవర్ బర్డెన్ (మట్టి) వెలికితీతపై కాంట్రాక్టర్లు లక్ష్యాల దిశగా ముందుకు సాగాలని సూచిస్తున్నారు.

పెండింగ్ ప్రాజెక్టులపై డైరెక్టర్ల దృష్టి

సింగరేణి వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న గనుల విస్తరణ పనులపై డైరెక్టర్లు ఏరియాల వారీగా పర్యటిస్తున్నారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న ఆరు జిల్లాల కలెక్టర్లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. గనుల విస్తరణకు ప్రతిబంధకంగా ఉన్న ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూసేకరణ, తదితర రెవెన్యూ అంశాలపై ఆయా జీఎంలతో కలిసి కలెక్టర్లతో చర్చిస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. వేసవికాలం కావడంతో బొగ్గుకు విద్యుత్ సంస్థల నుంచి డిమాండ్ అధికంగా ఉంది. ఈక్రమంలో అదే స్థాయిలో ఉత్పత్తి సాధించాలంటే ప్రతి బంధకాల విషయంలో జిల్లా కలెక్టర్లు, రెవన్యూ అధికారులు సహకరించాలని కోరుతున్నారు. ఏది ఏమైనా ఈసారి వార్షిక లక్ష్యాలను సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

ఏప్రిల్ నెలలో బొగ్గు ఉత్పత్తి..

ఏరియా	లక్ష్యం	సాధించింది	శాతం
ఆర్జీ–1	3.86	3.48	90
ఆర్జీ–2	7.53	7.54	100
ఆర్జీ–3	4.39	4.54	103
ఏపీఏ	1.43	0.68	48
భూపాల్‌పల్లి	3.88	2.64	68
కొత్తగూడెం	10.13	11.37	112
ఇల్లెందు	2.60	3.48	134
మణుగూరు	9.67	12.07	125
శ్రీరాంపూర్	6.26	3.73	60
మందమర్రి	3.68	3.05	83
బెల్లంపల్లి	2.59	3.18	123
మొత్తం	56.02	55.76	99

24 అంశాలకు కౌన్సిల్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అనిల్‌కుమార్, పాల్గొన్న కార్పొరేటర్లు

- సాధారణ సమావేశంలో మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): కొత్త భవనాలకు ఆస్తి పన్ను మదింపు చేసి, మున్సిపల్ ఆదాయం పెంచాలని రామగుండం నగరపాలక సంస్థ మేయర్ బంగి అనిల్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో మంగళవారం 13వ సాధారణ సమావేశం జరిగింది. సమావేశానికి మేయర్ అధ్యక్షత వహించారు. మొత్తం 24 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎక్కువ భాగం జనగామ శివారు ఉందని, చారిత్రక ప్రాధాన్యత కలిగిన జనగామ గ్రామానికి గుర్తింపు తెచ్చేలా మున్సిపల్ కార్పొరేషన్ పేరును ×జనగామ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్×గా మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేయాలని కార్పొరేటర్లు కవితా సరోజినీ, ధాతు శ్రీనివాస్, వేగోలపు రమాదేవి, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు ప్రతిపాదించారు. పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్లలో అభివృద్ధి పనులు జరగడం లేదంటూ మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సంబంధత ఇంజనీర్లతో మేయర్ వివరణ ఇప్పించారు.

మంత్రికి స్వాగతం పలుకుదాం

రామగుండం కార్పొరేషన్‌కు ఈ నెల 8న మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్ వివిధ అభివృద్ధి పనుల ప్రారంభానికి విచ్చేస్తున్నందున, పాలకవర్గం తరఫున ఘనంగా స్వాగతం పలుకుదామని మేయర్ అనిల్‌కుమార్ తెలిపారు. బల్దియాలో అనేక కొత్త నిర్మాణాలు వస్తున్నందున అన్నింటినీ పన్ను పరిధిలోకి తీసుకురావాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులతోపాటు కమిషనర్ సుమన్‌రావు, డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, ఎస్‌ఈ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల ఆగడాలు అరికట్టాలి



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పాలకుర్తి(రామగుండం): ధాన్యంలో తేమ, తాలు పేరుతో కోతలు విధిస్తూ రైతులకు ఆర్థికంగా నష్టం చేస్తున్న మిల్లర్ల ఆగడాలను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని, ఈవిషయంలో ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకోవాలని జిల్లా సహకార సంఘాల ఉపాధ్యక్షుడు, కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి కోరారు. సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బసంత్‌నగర్, కొత్తపల్లి, పాలకుర్తి గ్రామాల వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం నిల్వలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు కేంద్రాల్లో కొనుగోళ్లు సజావుగా సాగడం లేదని, మిల్లర్లు బస్తాకు 4 కిలోల చొప్పున క్వింటాల్‌కు 10కిలోల ధాన్యం కటింగ్ చేస్తున్నారని, లేదంటే లారీలు అన్‌లోడింగ్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ, టీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలుపరుస్తుంటే, మిల్లర్ల చర్యల వల్ల క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, దీనిపై మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు జిల్లా ఎమ్మెల్యేలు స్పందించి అధికారులతో చర్చించి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): కార్మిక క్షేత్రంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గంగానగర్ వద్ద ఉన్న ఫిల్టర్‌బెడ్ మెదటిస్థాయిలో నీటిని శుద్ధి చేసేందుకు ఇసుకను మార్చి నూతన ఇసుక నింపామన్నారు. ఇంటెక్ వెల్ ఫిల్టర్లు శుభ్రం చేసేందుకు పూణే నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణుల సహకారం తీసుకున్నామని వివరించారు. తాగునీటి శాశ్వత పరిష్కార మార్గం కోసం 'ర్యాపిడ్ గ్రావిటి ఫిల్టర్'ను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తి ఆశాజనకంగా ఉన్నా నిర్దేశిత లక్ష్యాల్లో 90శాతం చేరుకున్నట్లు వివరించారు. ఏరియాలో ఇప్పటి వరకు 1,546 మంది ఉద్యోగులు మెడికల్ ఇన్‌వాలిడేషన్ కాగా 1,339 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించామన్నారు. సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం రామ్మోహన్, జీడీకే–5 ఓసీపీ ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, సైదులు, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డుకు ఎంపిక



మల్లేశ్

గోదావరిఖనిటౌన్(రామగుండం): స్థానిక ఇందిరానగర్‌కు చెందిన సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేశ్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యాడు. తార ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 6,7 తేదీల్లో ఉత్తరాఖాండ్ రాష్ట్రం హరిద్వార్‌లో మహాకుంభ నృత్యోత్సవం సందర్భంగా పురస్కారం అందుకోనున్నారు. కరోనా కాలంలో పేదలకు సేవ చేసినందుకుగాను మల్లేశ్‌ను ఎంపిక చేసినట్లు అకాడమీ చైర్మన్ రాజేశ్ తెలిపారు.

హనుమాన్ ఆలయంలో పాము కలకలం



ఆలయ ద్వారంపై పాము

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణంలోని పెరిగిద్ద హనుమాన్ ఆలయంలో పాము కలకలం సృష్టించింది. మంగళవారం స్వామివారి గర్భగుడి ద్వారంపై పాము కనిపించడంతో హనుమాన్ దీక్షాపరులు బయటకు పంపించారు.

మున్సిపల్ కార్మికులకు రూ.21వేల వేతనమివ్వాలి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.21వేలకు పెంచి ఇవ్వాలని యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎరవెల్లి ముత్యంరావు అన్నారు. మంగళవారం కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. తొలి పీఆర్‌సీలో రూ.19వేలు ఇవ్వాలని నిర్ణయించి, అందులో రూ.3,400 కోత విధించారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇస్తున్న రీతిన తెలంగాణలోనూ కార్మికులందరికీ రూ.21వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే డే సందర్భంగా రూ.వెయ్యి పెంచుతున్నట్లు ప్రకటించి ప్రభుత్వం కార్మికులను మోసగించిందన్నారు. సీఎం కేసీఆర్ ఈ పెంపును పునఃసమీక్షించాలన్నారు. పంచాయతీల్లో కేవలం రూ.8,500 ఇస్తూ మల్టీపర్పస్ విధానంతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి వేతనాలను పెంచాలని, లేకుంటే పోరుబాట పడతామన్నారు. నాయకులు వెంకటస్వామి, సురేశ్, శ్రీనివాస్, కిష్టయ్య, కొమురయ్య, రవి, కాజా, రాజబాబు, రాజయ్య, వెంకటేశ్ తదితరులున్నారు.

కారు, ఆటో ఢీకొని ఒకరి మృతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

- మరో 8 మందికి తీవ్రగాయాలు
- పెండ్లి వేడుకలకు వస్తూ ప్రమాదానికి గురైన కుటుంబం

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం గ్రామం వద్ద పెద్దపల్లి– మంథని ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 8మందికి గాయాలైనాయి. పోలీసుల వివరాలు.. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన తంతనపల్లి అశోక్(40) సొంత ఆటోలో అతడి భార్య రజిత, పిల్లలు రక్షిత, సాత్విక్ తో కలిసి కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామంలో జరిగే వివాహ వేడుకలకు వస్తున్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన బంధువులు సుజాత, రాహుల్‌ను ఆటోలో వారి వెంట తీసుకువస్తున్నారు. కమాన్‌పూర్ మండలం గుండారం రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే మంథని నుంచి వస్తున్న కారు, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటో రోడ్డుపై బోల్తా పడగా, కారు రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకెళ్లింది. ఆటో నడపుతున్న అశోక్, అందులో ఉన్న రజిత, రక్షిత, సాత్విక్, సుజాత, రాహుల్‌కు తీవ్రగాయాలు కాగా, కారులో ఉన్న ఉదయ్, ఆగయ్య, రాధకు స్వల్ప గాయాలైనాయి. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై షేక్‌మస్తాన్ క్షతగాత్రులను ఆటోలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన అశోక్, రజిత, రక్షిత, సాత్విక్, సుజాత, రాహుల్‌ను కరీంగనర్‌లోని ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.



గాయపడిన అశోక్, రజిత (భార్యాభర్తలు)



తీవ్రంగా గాయపడిన రక్షిత, సాత్విక్(అక్కా తమ్ముడు)

రైలు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



వెంకటరమణ (ఫైల్)

రామగుండం: రామగుండం రెండో ప్లాట్‌ఫారంపై రైలింజన్ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి వివరాల మేరకు.. స్థానికంగా చేపల చెరువులో పని చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం ఉండూరుకు చెందిన గొడుగు వెంకటరమణ(61) సోమవారం అర్ధరాత్రి రామగుండం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. అర్ధరాత్రి రైలు దిగడంతో తెల్లవారిన తర్వాత పని ప్రదేశానికి వెళ్లవచ్చని నిర్ణయించుకొని రెండో ప్లాట్‌ఫారంపై సేద తీరుతున్నాడు. ఈ క్రమంలో వేకువజామున రెండో ప్లాట్‌ఫారం దిగి వ్యక్తి ప్లాట్‌ఫారం ఎత్తు ఎక్కువగా ఉండడంతో అదే ప్రయత్నంగా ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా అతి వేగంతో వస్తున్న రైలింజన్ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలతో కుటుంబసభ్యులకు ఫోన్ చేయగా రామగుండం చేరుకున్నారు. ఉపాధి కోసం వచ్చి పనిలో చేరకముందే రైలు ప్రమాదంలో చనిపోయాడంటూ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నామని తిరుపతి పేర్కొన్నారు.

ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి బైఠాయింపు

పెద్దపల్లిరూరల్: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడంటూ ఓ యువతి ప్రియుడు కలవేన రాజ్‌కుమార్ ఇంటి ముందు బైఠాయించిన ఘటన పెద్దపల్లి మండలం హనుమంతునిపేటలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమంతునిపేట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన రాజ్‌కుమార్ ఇప్పుడు ముఖం చాటేశాడు. దీంతో ఆ యువతి తన కుటుంబీకులతో వచ్చి రాజ్‌కుమార్ ఇంటి ముందు బైఠాయించింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ సదయ్య, గ్రామ పెద్దలు సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో యువతి తన ఇంటికి వెళ్లిపోయింది. కాగా రాజ్‌కుమార్‌తో మాట్లాడి పెళ్లికి ఒప్పించేందుకు సర్పంచ్ సహా పెద్దలు ప్రయత్నిస్తున్నారు.

అత్తింటివారిపై కేసు

జగిత్యాలక్రైం: వివాహితను కట్నం కోసం వేధించిన అత్తింటివారిపై కేసు నమోదైంది. ఎస్సై సంజీవ్ వివరాలు.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సాయిరాం నగర్‌కు చెందిన వర్షిణికి జిల్లా కేంద్రానికే చెందిన రంజిత్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిపించారు. కొంతకాలంగా వర్షిణిని కట్నం కోసం వేధిస్తున్నందుకు భర్త రంజిత్, మామ గంగాధర్, అత్త స్వరూపపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

మంథని: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో మంథనికి చెందిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు అర్థశాస్త్ర విభాగం అధ్యాపకుడు ఆడెపు లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ తాహెర్ హుస్సేన్, అధ్యాపకులు అభినందించారు.